# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- ❖ పేదవాడి అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.
- ❖ యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చాంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో వర్షాలు పడే అవకాశం వుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ ప్రణాళిక అమలు అంశాలపై ఎన్నికల అధికారులతో వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఏపీఎస్పీ బెటాలియన్స్ అదనపు డీజీపీ అతుల్ సింగ్, అదనపు సీఈవో లు పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్ తో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఐ.జి.లు, డి.ఐ.జి.లు, సీపీలు, ఎస్పీలు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేసిందని ఆ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ రోజు కర్నూల్ లో నిర్వహించిన ప్రచార సభలో పాల్గొన్న ఆయన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేశామని అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధన, పేదవారి వైద్యం కోసం ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని అన్నారు. పేదల అభివృద్ధికి

ప్రభుత్వం కట్టుబడి వుందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించాలని జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈరోజు పర్యటించారు. కురుపాం నియోజకవర్గం రావాడ కూడలిలో ప్రజాగళం సభలో పాల్గొని ఆయన మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వస్తే మొదటి సంతకం మెగా డిఎస్సీ పైనే చేస్తానని అన్నారు. యువతకి ఇంటి దగ్గరే ఉంటూ అమెరికా కంపెనీల ద్వారా వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగాలు తెస్తామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తామని అన్నారు. వృద్దాప్య పెన్షన్ నాలుగు వేల రూపాయలు ఇంటి వద్దకే ఇస్తామని తెలిపారు. జిల్లాలోని తోటపల్లి రిజర్వాయర్ ద్వారా పరిసర ప్రాంతాలకు తాగునీటిని అందిస్తామని, గుమ్మలక్ష్మీపురంలో జీడిపప్పు పరిశ్రమ ఏర్పాటునకు కృషి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చార్‌ధామ్ యాత్ర రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ వర్షాలతో స్థానికులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ యాత్ర చేసేందుకు లక్షలాది మంది తమ పేర్లు నమోదు చేసుకోగా, కొంతమంది భక్తులు ఇప్పటికే ఉత్తరాఖండ్ చేరుకున్నారు. ఈ నెల 13 వరకు ఉత్తరాఖండ్‌లోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇటువంటి వర్షాల సమయంలో ట్రెక్కింగ్ చేయవద్దని పర్యాటకులకు భారత వాతావరణ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్టణం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట నియోజకవర్గంలో వినియోగించనున్న ఈవీఎంల రెండో విడత సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ రోజు పూర్తయ్యింది. జిల్లా సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ ఆధ్వర్యంలో, రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో ఆన్ లైన్ విధానంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. సాంకేతిక కారణాల వల్ల పని చేయని కొన్ని కంట్రోల్ యూనిట్లను రిప్లేస్ చేశారు. ఈ నేపథ్యంలో వాటి స్థానంలో మరొక 116 ఈవీఎంలను రిజర్వ్ కోటా కింద కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ ఆన్ లైన్ ద్వారా పర్యవేక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల నియమావళిని పాటిస్తూ, మరింత బాధ్యతగా విధులను నిర్వహించాలని శ్రీకాకుళం జిల్లా ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి అధికారులకు సూచించారు. ఈ రోజు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఓటు వేసుకునే పరిస్థితులు కల్పించాలని అన్నారు. పోలింగ్ కు ముందు 48 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని పేర్కొన్నారు. ప్రచార ఖర్చుల పర్యవేక్షణలో భాగంగా అభ్యర్థుల ఖర్చు, రిజిస్టర్ల చివరి దశ తనిఖీ పూర్తి చేయాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర మీద నున్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలో వర్షాలు పడే అవకాశం వుందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలింగ్ సిబ్బందిని  సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేర్చవలని బాధ్యత సెక్టార్ అధికారులపైనే ఉందని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ  ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. ఈ రోజు అరకు వ్యాలీ తాహాశీల్దార్ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బంది, సెక్టార్ అధికారులు సమన్వయంతో పనిచేసి సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయాలని అన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సకాలంలో సంబందిత పోలింగ్ కేంద్రాలకు చేరాలని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సెక్టార్ అధికారులు కీలకమని కృష్ణ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ అన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి  స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సెక్టార్ అధికారులు, ఏ ఎల్ ఎం టి లకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 13వ తేదీన జిల్లాలో పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రీసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టార్ అధికారులకు ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చామని అన్నారు. ఈవీఎంలు మొరాయించకుండా, పోలింగ్ సక్రమంగా జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గర్భిణీల్లో రక్త హీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా సమిష్టి కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈరోజు జిల్లాలోని పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. అనంతరం గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మాతాశిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు, తగ్గులు గుర్తించిన గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలపి ఆదేశించారు. గర్భిణీల్లో జ్వర లక్షణాలను గుర్తిస్తే హైరిస్క్ గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలని కోరారు. డీ హైడ్రేషన్ కు గురి కాకుండా ఎక్కువగా నీరు, ద్రవ రూప ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణీలకు ఆయన సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని జగన్ మోహన్ రావు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో భాగంగా  పోలింగ్ రోజున, పోలింగ్ కు ముందు రోజు జిల్లా స్థాయిలో దినపత్రికలలో ప్రచురించే రాజకీయ ప్రకటనలకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రకటనలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఉండకూడదని, వివిధ మాధ్యమాల్లో జారీ చేసే ప్రకటనలకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, తదుపరి ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

==========================